సాక్షి
విశాఖపట్నం
శనివారం । 25 । నవంబర్ । 2023



అందరికీ న్యాయం

అడవివరంలోని బీఆర్‌టీఎస్ బాధితులందరికీ పూర్తి న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి హామీ ఇచ్చారు. 10లో

మిలీనియం టవర్స్‌లో.. మినీ సెక్రటేరియట్

- రుషికొండలో సీఎం క్యాంపు కార్యాలయం
- పలు విభాగాల కార్యాలయాలకు భవనాల ఎంపిక
- పెందుర్తి నుంచి ఎండాడ వరకూ..
- కీలక విభాగాలకు భవనాల కేటాయింపు షురూ
- నీతిఆయోగ్ గ్రోత్‌హబ్‌గా ఎంపికైన విశాఖ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- సీఎం వైఎస్ జగన్ నిరంతర సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ
- రాష్ట్ర కమిటీ అందించిన నివేదిక ప్రకారం నిర్ణయం



మిలీనియం టవర్స్



సిరిపురం కాలనీలో వీఎంఆర్‌డీఏ భవనం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం : నీతి ఆయోగ్ గ్రోత్ హబ్‌లో చోటు దక్కించుకున్న విశాఖ కేంద్రంగా అధికార కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. మిలీనియం టవర్స్ ఇక నుంచి మినీ సెక్రటేరియట్‌గా సేవలందించనుంది. రుషికొండలోని టూరిజం ప్రాజెక్టు ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంగా మారనున్నట్టు తెలుస్తోంది. అటు పెందుర్తి నుంచి ఇటు ఎండాడ వరకూ వివిధ రాష్ట్ర స్థాయి కార్యాలయాలు ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం సీఎం సమీక్షకు కేంద్రంగా మారనున్నాయి. వాస్తవానికి నవ్యాంధ్రలోని నగరాలతో పోలిస్తే.. విశాఖ విశాలమైన, ప్లాన్డ్ సిటీగా దేశ విదేశీ ప్రముఖులు సైతం కొనియాడారు. భిన్న వాతావరణం, విభిన్న సంస్కృతులు, మెచ్చే భాషలు, ఆది నుంచి దూసుకుపోతున్న రియల్ రంగం, అందుబాటులో మౌలిక వసతులు.. వెరసి దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు విశాఖ వైపు చూసేలా చేస్తున్నాయి. అందుకే నీతీ ఆయోగ్ గ్రోత్ హబ్స్ ఫస్ట్ ఫేజ్‌లో విశాఖ నగరం చోటు దక్కించుకుంది. అభివృద్ధికి కేంద్రంగా రాబోయే నాలుగైదేళ్లలో హైదరాబాద్‌కు దీటుగా ఎదిగేలా విశాఖ నగరం దూసుకుపోయేందుకు ఉన్న అభివృద్ధి అవకాశాల్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బృందం.. విశాఖ నుంచి పరిపాలన సాగించేందుకు సిద్ధమవుతోంది. ఆర్థిక వృద్ధికి రోడ్‌మ్యాప్ సిద్ధం చేసేందుకు ఏర్పాటు చేసిన జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీల అందించిన నివేదిక ప్రకారం సీఎం పరిపాలన కార్యాలయంతో పాటు కీలక శాఖలకు క్యాంపు కార్యాలయాల్ని గుర్తించారు.

ఏ శాఖ కార్యాలయం ఎక్కడంటే...!

నగరంలోని వివిధ ప్రభుత్వ భవనాల్లో మొత్తం 2,27,287 చ.అడుగులు గుర్తించి ఆయా శాఖలకు కేటాయించారు. మొత్తం 35 శాఖలుండగా.. వీటిలో ఇప్పటి వరకూ 16 శాఖలకు భవనాలను గుర్తించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ ఉన్నతాధికారులు అందుబాటులో ఉండేలా భవనాల్ని ఎంపిక చేశారు. పెందుర్తి, మర్రిపాలెం, కంచరపాలెం, రామ్‌నగర్, మహరాణిపేట, మద్దిలపాలెం, ఆంధ్ర విశ్వవిద్యాలయం, సిరిపురం, దుర్గానగర్, ఎంవీపీ మిగతా 10వ పేజీలో ▶

మిలీనియం టవర్స్ కేంద్రంగా..

రుషికొండలోని ఐటీటవర్స్‌లో టవర్-బిని తూతూ మంత్రంగా నిర్మాణం చేసి టీడీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. ఈ బాధ్యతను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భుజానికెత్తుకుంది. టవర్-బీని పూర్తిస్థాయిలో నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.65.12 కోట్లు ఖర్చవుతుందని ఏపీఐఐసీ అధికారులు నివేదిక అందించారు. 2020 నుంచి విడతల వారీగా నిధులు మంజూరు చేస్తూ మిలీనియం టవర్-బీని ప్రభుత్వం అభివృద్ధి చేసింది. మంత్రులు, సీనియర్ అధికారుల సమీక్ష సమావేశాలకు ఈ భవనాన్ని వినియోగించనున్నారు. సొంత భవనాల్లేని ప్రధాన శాఖలకు కూడా ఈ భవనాన్ని కేటాయించనున్నారు. ప్రస్తుతం మిలీనియం టవర్-ఏ,బీల్లో 1.75 లక్షల చ.అడుగుల విస్తీర్ణం ఖాళీగా ఉంది. వీటన్నింటిలో పలు శాఖలు సర్దుబాటు కానున్నాయి.

ఉత్తరాంధ్ర అభివృద్ధే ధ్యేయంగా..

దశాబ్దాలుగా వెనకబాటుతనానికి గురై అభివృద్ధికి నోచుకోని ఉత్తరాంధ్ర జిల్లాల్లో వెలుగులు నింపేందుకు వైఎస్ జగన్ సీఎంగా ప్రమాణస్వీకారం చేపట్టినప్పటినుంచి ప్రత్యేక ప్రణాళికలను అమలు చేస్తున్నారు. నీతి ఆయోగ్ గ్రోత్‌హబ్ జాబితాలో విశాఖ ఎంపిక కావడంతో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. అందుకే దీనికి సంబంధించిన అంశాలను స్వయంగా విశాఖ నుంచే సమీక్షించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి సీఎం క్యాంపు కార్యాలయంతో పాటు ఇతర శాఖల క్యాంపు కార్యాలయాలకు సంబంధించిన భవనాల ఎంపికపై కసరత్తు చేశారు. కేవలం విశాఖ మాత్రమే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాలన్నీ సమతులాభివృద్ధి చెందేలా క్షేత్ర స్థాయిలో సమీక్షల్ని సీఎం వైఎస్ జగన్ విశాఖ నుంచి నిర్వహించనున్నారు.



వీఎంఆర్‌డీఏ భవనం

గ్రోత్ హబ్ దిశగా..

రెండేళ్ల క్రితం నీతి ఆయోగ్ ప్రకటించిన పట్టణ సుస్థిర అభివృద్ధి సూచికలో రెండు తెలుగు రాష్ట్రాల్లో మొదటి ర్యాంకును, జాతీయ స్థాయిలో 18వ ర్యాంకును సాధించిన నేపథ్యంలో.. విశాఖ నగరాన్ని గ్రోత్‌హబ్ పైలట్ సిటీగా ఎంపిక చేశారు. సహజ వనరులతో పాటు రైల్వే కనెక్టవిటీ, పోర్టు కనెక్టవిటీతో పాటు రాబోయే రోజుల్లో అంతర్జాతీయ విమానాశ్రయం కూడా రాబోతున్న నేపథ్యంలో గ్రోత్ హబ్‌గా ఎంపికైన విశాఖ అభివృద్ధి పథంలో దూసుకుపోనుంది. ఈ తరుణంలో విజన్ ఫర్ వైజాగ్ సిటీ పేరుతో దీనికి సంబంధించిన ఆర్థిక, అభివృద్ధి ప్రణాళికలపై నీతి ఆయోగ్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి, అవకాశాలపై నిరంతరం అధ్యయనం చేసేందుకు స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విశాఖ నుంచి పరిపాలన సాగించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే.. సీఎం క్యాంపు కార్యాలయంతో పాటు ఇతర శాఖల ముఖ్య అధికారుల క్యాంపు కార్యాలయాలకు భవనాలను ఎంపిక చేశారు.



అభిమానులకు అభివాదం చేస్తున్న నాగార్జున, చిత్రంలో అక్కినేని అఖిల్



ఏయూలో కింగ్ సందడి

ఏయూక్యాంపస్: ఆంధ్రయూనివర్సిటీలో కింగ్ నాగార్జున, అందాల నటుడు అఖిల్ సందడి చేశారు. ఏయూలో ఆధునికీకరించిన ఆరు బయలు రంగస్థలం–అస్కిన్ స్క్వేర్ పునఃప్రారంభానికి వచ్చిన అక్కినేని హీరోలకు ఘనస్వాగతం లభించింది. ముఖ్యంగా అఖిల్‌ను చూసేందుకు విద్యార్థినులు భారీగా తరలివచ్చారు. ఒక్కసారిగా అక్కినేని నటులను చూడగానే విద్యార్థినులు కేరింతలు కొట్టారు. సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీశారు. వేలాదిగా విద్యార్థులు తరలిరావడంతో ప్రాంగణం నిండిపోయింది. దీంతో విద్యార్థులు జువాలజీ విభాగం భవనం మెదటి, రెండో అంతస్థులపైకి చేరుకుని అక్కడ నుంచి తమ అభిమాన నటుడుని వీక్షించారు. విద్యార్థుల అభిమానానికి కింగ్ నాగార్జున ఎంతో సంతోషానికి లోనయ్యారు. సినీ నేపథ్య గాయకుడు ధనుంజయ్ శివ సినిమాలోని బోటనీ పాఠముంది...మేటనీ ఆట వుంది అంటూ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి, రెక్టార్ ఆచార్య కె.సమత, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తిలో 'సామాజిక సాధికార బస్సు యాత్ర' నేడు

- విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు వైవీ సుబ్బారెడ్డి పిలుపు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ తలపెట్టిన రెండో విడత సామాజిక సాధికార బస్సు యాత్ర శనివారం పెందుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో జరగనుంది. యాత్రలో భాగంగా సీఎం వైఎస్ జగన్ బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి గురించి వివరించనున్నారు. అలాగే గత టీడీపీ ప్రభు త్వం పేదలకు చేసిన మోసాన్ని ఎండగట్టనున్నారు. సీఎం వైఎస్ జగన్ కుల, మతాలకతీతంగా అర్హులైన అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలను అందజేయడంతో పాటు అన్ని సామాజిక వర్గాలకూ రాజకీయంగా ప్రాధాన్యమిచ్చారు. చేసిన మంచిని ప్రజలకు వివరించేందుకు సామాజిక సాధికారత పేరుతో బస్సు యాత్ర నిర్వహిస్తున్నారు. ఈ యాత్రకు స్పీకర్ తమ్మినేని సీతారాం, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ధర్మాన ప్రసాదరావు, ఎంపీ నందిగాం సురేష్,తదితరులు హాజరు కానున్నారు.

బస్సు యాత్ర సాగేదిలా..

- ఉదయం 10.30 గంటలకు పెందుర్తి నియోజకవర్గం వేపగుంట జంక్షన్‌లో సామాజిక సాధికార బస్సు యాత్రకు స్వాగతం
- 10.45 గంటలకు మంత్రుల ప్రెస్‌మీట్
- 11.30 గంటలకు యాత్ర ప్రారంభం. వేపగుంట జంక్షన్ నుంచి పాలిటెక్నిక్ కళాశాల వరకూ బైక్ ర్యాలీ
- మధ్యాహ్నం 12 గంటలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నూతన బ్లాక్ ప్రారంభం. అనంతరం అక్కడి నుంచి వెల్ఫేర్ కళాశాల వరకూ ర్యాలీ. అక్కడే లంచ్ ఏర్పాటు
- మధ్యాహ్నం 3.30 గంటలకు సబ్బవరం మూడు రోడ్ల జంక్షన్ వద్ద భారీ బహిరంగ సభ



సబ్బవరంలో బస్సు యాత్రకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

యాత్ర విజయవంతం చేయండి

సామాజిక సాధికార బస్సు యాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా రాజకీయంగా, నామినేటెడ్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సామాజిక న్యాయం చేసి బడుగు బలహీన వర్గాల పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధి పొందిన ప్రతి ఒక్క కుటుంబం యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలి

– వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్

ప్రతి ఫిర్యాదు పరిగణనలోకి

- కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం : జిల్లాలో కచ్చితమైన ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా పెండింగ్ ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించామని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో విజయవాడ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెండింగ్ ఓటర్లు, 18 ఏళ్లు నిండిన ఓటర్ల గుర్తింపు తదితర అంశాలపై జిల్లాల వారీగా చర్చించారు. కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫారం–6,7,8 పెండింగ్ క్లియర్ చేసేందుకు ప్రత్యేకంగా సిబ్బంది పని చేస్తున్నారని, రానున్న మూడు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. వీటితో పాటు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతం చేసినట్లు వివరించారు. 18, 19 ఏళ్ల యువతను ఓటర్లుగా నమోదు చేసేందుకు ఈఆర్వోలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఈఆర్వోలు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి సింహగిరిపై వరుణ జప హోమం

సింహాచలం : సింహగిరిపై త్రిపురాంతక స్వామి ఆలయంలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు వరుణ జప హోమం నిర్వహిస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి శుక్రవారం తెలిపారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. దీనిలో భాగంగా 27 సాయంత్రం 5 గంటలకు జప సంకల్పం, రుత్విక్ వరణం, 28న గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, కలశస్థాపన, రుద్రాభిషేకం, వరుణ జపం, 28 ఉదయం 11 గంటలకు సహస్ర ఘటాభిషేకం, 30 ఉదయం 10 గంటలకు మహా పూర్ణాహుతి, అగ్ని ప్రతిష్టాపన, జప హోమం, ప్రసాద వితరణ, అన్నసమారాధ నిర్వహించనున్నట్లు తెలిపారు.

విశాఖ నుంచి.. విజయోత్సాహంతో..



విమానాశ్రయంలో భారత క్రికెటర్లతో సెల్ఫీలు తీసుకుంటున్న అభిమానులు

గోపాలపట్నం: భారత్, ఆస్ట్రేలియా జట్లు శుక్రవారం విశాఖ నుంచి తిరుగు ప్రయాణమయ్యాయి. వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో గురువారం జరిగిన టీ–20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై భారత్ జట్టు గొప్ప విజయం సాధించిన సంగతి తెలిసిందే. రెండో టీ–20 మ్యాచ్ తిరువనంతపురంలో జరగనుంది. ఈ మ్యాచ్ కోసం శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు స్పైస్ జెట్ ప్రత్యేక విమానంలో ఇరుజట్ల సభ్యులు తిరువనంతపురం పయనమయ్యారు. వీరిని అభిమానులు, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా వీడ్కోలు పలికారు. పలువురు అభిమానులు క్రికెటర్లతో సెల్ఫీలు దిగారు.





విశాఖ విమానాశ్రయంలోకి వస్తున్న భారత, ఆస్ట్రేలియా క్రికెటర్లు

జర్నలిస్టులపై నోరుపారేసుకున్న జనసేన కార్పొరేటర్

మహారాణిపేట: జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ జర్నలిస్టులపై నోరు పారేసుకున్నాడు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ విశాఖ పర్యటన కవర్ చేయడానికి వచ్చిన మీడియా ప్రతినిధులను బయటకు తోసేయాలంటూ మైక్‌లో అనౌన్స్ చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బోటు యజమానులను పరామర్శించి ఆర్థిక సాయం అందించడానికి పవన్ కల్యాణ్ శుక్రవారం సాయంత్రం విశాఖకు వచ్చారు. హార్బర్ వద్ద సభ ఏర్పాటు చేయగా.. వారి ఆహ్వానం మేరకు కవర్ చేసేందుకు మీడియా ప్రతినిధులు అక్కడకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ వ్యవహరించిన తీరు విమర్శలకు దారితీసింది. మీడియా పాయింట్ వద్ద ఉన్న జర్నలిస్టులను బయటకు తోసేయండి అంటూ మూర్తి యాదవ్ మైక్‌లో చెప్పడంతో జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూర్తి యాదవ్ వ్యాఖ్యల పట్ల అక్కడున్న జర్నలిస్టులందరూ అభ్యంతరం తెలిపారు.

మిలీనియం టవర్స్‌లో.. మినీ సెక్రటేరియట్

9వ పేజీ తరువాయి

కాలనీ, దయాళ్‌నగర్, హనుమంతువాక, ఎండాడ, భీమిలి వరకూ ఉన్న ప్రభుత్వ భవనాలను కేటాయించారు. మిగిలిన 19 శాఖలకు భవనాల గుర్తింపు ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ఏఏ శాఖలు ఎక్కడ రానున్నాయంటే...

- ఎండాడలోని ఎస్‌వీపీ లా కళాశాల రహదారిలో వ్యవసాయ, సహకార శాఖ కార్యాలయం రానుంది. ఇక్కడ ఉన్న వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయం, రీజినల్ కోడింగ్ సెంటర్ ల్యాబ్‌లను వ్యవసాయ శాఖ ప్రధాన కార్యాలయంగా ఎంపిక చేశారు. ఈ రెండు భవనాలు 3 వేల చ.అడుగుల విస్తీర్ణంలో ఉన్నాయి. అదేవిధంగా కోఆపరేటివ్ శాఖ కార్యాలయంగా మద్రిపాలెంలో 4 అంతస్తుల్లో 20 వేల చ.అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఆప్కాబ్ రిజర్వ్‌డ్ భవనాన్ని గుర్తించారు.
- పశుసంవర్థక, మత్స్యశాఖ కార్యాలయాలను కూడా ఎంపిక చేశారు. వీటికోసం హనుమంతువాకలో 2 వేల చ.అడుగుల విస్తీర్ణంలో ఉన్న పశుసంవర్థక శాఖ కార్యాలయం, ఆదర్శనగర్‌లోని రీజినల్ ట్రైనింగ్ కేంద్రాన్ని గుర్తించారు.
- ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఈఎఫ్‌ఎస్ అండ్ టీ) దయాల్‌నగర్ కాలనీలో డా.ఎన్టీఆర్ రోడ్ బీచ్‌రోడ్‌లో ఉన్న ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌ని ఎంపిక చేశారు. 13 వేల చ.అడుగుల విస్తీర్ణం ఉన్న ఈ భవనంలో ఉన్న నాలుగు గదులను ఉన్నతాధికారుల నివాసానికి వినియోగించనున్నారు.
- వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయాలు, ఉన్నతాధికారుల నివాసాలకు విమ్స్‌లో ఉన్న కొన్ని భవనాలను కేటాయించారు. 4 వేల చ.అడుగులున్న రీజినల్ డ్రగ్ స్టోర్, 8 వేల చ.అ. ఉన్న జాయింట్ డ్రగ్ కంట్రోల్ ఆఫీస్‌తో పాటు డీఎంహెచ్‌వో కార్యాలయం సమీపంలో ఉన్న కొన్ని పాత భవనాలను ఆధునికీకరించి వినియోగించనున్నారు. అదేవిధంగా ఉన్నతాధికారుల నివాస ప్రాంతంగా విమ్స్‌లో ఉన్న కొన్ని స్పెషల్‌రూమ్స్‌ను గుర్తించారు.



జలవనరుల శాఖ అతిథి గృహం

- హోంశాఖ క్యాంపు కార్యాలయం కేజీహెచ్ డౌన్‌లోని కృష్ణానగర్‌కి రానుంది. ఇక్కడ ఉన్న జిల్లా, ప్రాంతీయ అగ్నిమాపక కార్యాలయాన్ని హోం శాఖ కోసం గుర్తించారు. ఈ భవనంలో ఒక అంతస్తు ప్రస్తుతం ఖాళీగా ఉంది.
- పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యాలయంగా కంచరపాలెంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌ని ఎంపిక చేశారు. 2500 చ.అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఏపీఐఐసీ జోనల్ ఆఫీస్, 2 వేల చ.అడుగుల కంచరపాలెం ఎస్టేట్‌ని వినియోగించనున్నారు.
- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్‌లో ఉన్న వివిధ శాఖలకు 7 భవనాలను ఎంపిక చేశారు. 27,345 చ.అడుగుల విస్తీర్ణంలో ముడసర్లోవ సమీపం దుర్గానగర్‌లో ఉన్న జీవీఎంసీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌తో పాటు 9146 చ.అడుగుల రామ్‌నగర్ షాపింగ్ కాంప్లెక్స్, ఎంవీపీ కాలనీ సెక్టార్–12లోని 2,219 చ.అడుగుల న్యూ షాపింగ్ కాంప్లెక్స్, చినముషిడివాడలో 54,083 చ.అడుగుల విస్తీర్ణం గల వీఎంఆర్‌డీఏ కల్యాణ మండపం, పిఠాపురం కాలనీలో 24,109 చ.అడుగులున్న వీఎంఆర్‌డీఏ షాపింగ్ కాంప్లెక్స్‌ను గుర్తించారు. వీటితో పాటు వీఎంఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఖాళీగా ఉన్న 32,540 చ.అడుగుల విస్తీర్ణాన్ని కూడా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌ను ఉపయోగించనున్నారు.
- పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ ఉన్నతాధికారుల నివాస స్థలంగా కైలాసగిరి సమీపంలో 8 వేల చ.అడుగులతో ఉన్న 6 యూనిట్స్ ఉన్న గెస్ట్ హౌస్‌ను గుర్తించారు.



ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పరిశ్రమల శాఖ కార్యాలయం

- పాఠశాల విద్య కార్యాలయంగా భీమిలిలో 2,994 చ.అడుగుల విస్తీర్ణంలో డైట్ కళాశాలలో ఉన్న భవనాన్ని ఎంపిక చేశారు.
- వీఎంఆర్‌డీఏ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఖాళీగా ఉన్న కొంత భాగాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ శాఖకు కేటాయించారు.
- మద్రిపాలెంలోని ఆర్ అండ్‌బీ కార్యాలయంలో ఖాళీగా ఉన్న 4 వేల చ.అడుగుల విస్తీర్ణం గల 2 ఫ్లోర్లు, గంభీరంలోని రవాణా శాఖ కార్యాలయాల్ని రవాణా శాఖ, రహదారులు, భవనాల శాఖ క్యాంపు కార్యాలయాలుగా ఎంపిక చేశారు.
- రుషికొండ ప్రధాన రహదారిలో ఉన్న ట్రైబల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ను గిరిజన సంక్షేమ శాఖకు కేటాయించారు. ఈ భవనాన్ని ముఖ్యమంత్రి కార్యాలయంగా కూడా ఎంపిక చేసే అవకాశం ఉంది.
- రెవెన్యూ శాఖ కార్యాలయాలుగా సింహాచలంలోని దేవదాయ శాఖ భవనాలతో పాటు విజయనగరంలోని డిజాస్టర్ ట్రైనింగ్ సెంటర్‌ను ఎంపిక చేశారు.
- పెదవాల్తేరు ఆంధ్ర విశ్వ విద్యాలయం నార్త్ క్యాంపస్‌లో 10,300 చ.అడుగుల్లో ఉన్న ఓల్డ్ గెస్ట్ హౌస్‌ని ఆధునికీకరించి జలవనరుల శాఖ ఉన్నతాధికారుల నివాస స్థలంగా కేటాయించనున్నారు. అదే విధంగా దానికి సమీపంలో ఉన్న ఉత్తర కోస్తా చీఫ్ ఇంజినీర్ భవనంతో పాటు పెదవాల్తేరులో ఇదేశాఖకు చెందిన 37,500 చ.అడుగుల మూడంతస్తుల కొత్త భవనాన్ని కార్యాలయాలుగా గుర్తించారు. పర్యాటక శాఖ, యువజన సర్వీసుల శాఖ కార్యాలయాలుగా ఆర్‌అండ్‌బీలో మహిళా మండలి ఎదురుగా 1500 చ.అడుగులు, 3 వేల చ.అడుగుల అక్కిరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్, 7200 చ.అ. విస్తీర్ణం గల కేవీకే స్టేడియం ఆఫీస్‌ని ఎంపిక చేయగా రెసిడెన్స్‌గా బీచ్‌రోడ్డులోని హరిత రిసార్టును గుర్తించారు.



రామ్‌నగర్‌లో వీఎంఆర్‌డీఏ షాపింగ్ కాంప్లెక్స్

మరో 19 శాఖలకు గుర్తించే పనిలో..

వచ్చే నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖకు వచ్చే అవకాశాలున్నందున ఈలోపే మిగిలిన శాఖలకు భవనాలు గుర్తించేందుకు రాష్ట్ర, జిల్లా కమిటీలు అన్వేషణ సాగిస్తున్నాయి. బీసీ సంక్షేమం, పౌర సరఫరాలు, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, మహిళా శిశు సంక్షేమం, ఇంధనశాఖ, ఆర్థికశాఖ, సాధారణ పరిపాలన, గ్రామ, వార్డు సచివాలయాలు, ఉన్నత విద్య, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ, ఐటీ, కార్మిక శాఖ, న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ, ప్లానింగ్, ప్రభుత్వ రంగ సంస్థలు, సోషల్ వెల్ఫేర్, రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్‌టీజీ), గృహ నిర్మాణ శాఖలకు సంబంధించిన భవనాలు గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ శాఖల కార్యాలయాలను కూడా సాధ్యమైనంత త్వరలో గుర్తించే పనిలో ఇప్పటికే అధికారులు నిమగ్నమయ్యారు. మొత్తంగా డిసెంబర్ నెలలో విశాఖ నుంచే ప్రభుత్వ కార్యకలాపాలు సాగించే వీలు కలగనుందని అర్థమవుతోంది.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



కాళీ సాయి చరణ్ మృతదేహం

కొమ్మాది: తిమ్మాపురంలోని ఓ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం(ఎంపీసీ) చదువుతున్న గుడిసె కాళీ సాయిచరణ్ గురువారం రాత్రి తను ఉంటున్న వసతిగృహంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన స్నేహితులు, కళాశాల యాజమాన్యం అతన్ని హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా.. విద్యార్థి మృతిపై తల్లిదండ్రులు సంతోషి, శ్రీనివాస్ శుక్రవారం ఉదయం కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. మూడు రోజుల నుంచి తన కుమారుడు అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ.. యాజమాన్యం పట్టించుకోలేదని ఆరోపించారు. కళాశాల యాజమాన్యం, సిబ్బంది తన కుమారుడిని మానసికంగా వేధించారని, ఇవన్నీ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడని కన్నీటి పర్యంతమయ్యారు. దీనిపై కళాశాల యాజమాన్యాన్ని వివరణ కోరగా చరణ్ కడుపు నొప్పి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోలీసులు భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సీఐ డి.రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆందోళన వద్దు.. అందరికీ న్యాయం

- అడవివరం బీఆర్‌టీఎస్ బాధితులందరికీ పరిహారం
- భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్ హామీ
- డిసెంబర్ ఒకటి నాటికి నష్టపరిహారం, టీడీఆర్‌లు : జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

సింహాచలం: అడవివరంలోని బీఆర్‌టీఎస్ బాధితులందరికీ పూర్తి న్యాయం జరుగుతుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. అడవివరంలోని బీఆర్‌టీఎస్ బాధితులతో శుక్రవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, అధికారులతో కలిసి 98వ వార్డు పద్మావతినగర్‌లోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ సింహాచలం క్షేత్రానికి వచ్చే భక్తుల ఇబ్బందులు, అడవివరం మార్గంలో తీవ్ర ట్రాఫిక్ కష్టాలను అందరూ చూస్తున్నారన్నారు. అందుకే బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ ఆవశ్యకతను గుర్తించాలన్నారు. అంతేకానీ రాజకీయ దురుద్దేశంతోనో, కక్ష్య సాధింపుతోనో చేయడం లేదని చెప్పారు. నష్ట పరిహారం, టీడీఆర్‌లు ఇచ్చిన తర్వాతే రోడ్లు వేస్తామని హామీ ఇచ్చారు. ఎవరికీ అన్యాయం జరగకూడదన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమన్నారు. అందుకు అనుగుణంగా అధికారులు వ్యవహరించాలని కోరారు. మొత్తం 270 మంది బాధితులు ఉన్నారని, వీరిందరికీ భవన నష్ట పరిహారంతో పాటు నాలుగు టీడీఆర్‌లను అందిస్తామన్నారు. వీరిలో పూర్తిగా ఇళ్లు కోల్పోతున్న 70 మందికి మాత్రం జగనన్న కాలనీల్లో స్థలం ఇచ్చి నిర్మాణానికి రుణం మంజూరు చేస్తామన్నారు. ఖాళీ స్థలాలు కోల్పోతున్న వారికి కూడా టీడీఆర్‌లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రక్రియ అంతా డిసెంబరు ఒకటి నుంచి ఐదో తేదీలోపు పూర్తయ్యేలా కృషి చేస్తామన్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ మాట్లాడుతూ బాధితులకు ఎలాంటి అన్యాయం జరగదని హామీ ఇచ్చారు. భవనాలు కోల్పోయే వారిలో ఇప్పటికే కొంత మందికి నష్టపరిహారం అందించామన్నారు. ఇంకా 131 మంది వరకు మిగిలారని, వారికి కూడా ఈ నెల 30వ తేదీ కల్లా చెక్కులు జారీ చేస్తామన్నారు. పంచగ్రామాల భూసమస్య ఉన్నా ఒక అడుగు ముందుకేసి టీడీఆర్‌లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. వచ్చేనెల ఒకటో తేదీ నాటికి 270 మందికి నాలుగేసి టీడీఆర్‌ల జారీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఇప్పటికే అభ్యంతరాలు తెలియజేయాలని న్యూస్ పేపర్‌లో ప్రకటన ఇచ్చామని, ఇందు కోసం అడవివరంలోని సచివాలయంలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 27వ తేదీ వరకు ప్రత్యేక కేంద్రం అందుబాటులో ఉంటుందన్నారు. పంచ గ్రామాల్లో ఇళ్ల మరమ్మతులకు ఇటీవల ప్రభుత్వం జీవో జారీ చేసిందని, మరమ్మతులకు జీవీఎంసీ నుంచి ఎలాంటి అభ్యంతరం ఉండదని స్పష్టం చేశారు. టీడీఆర్‌లు అందరికీ సమాన మార్కెట్ విలువతో ఇవ్వాలని ముత్తంశెట్టి, కమిషనర్ దృష్టికి బాధితులు తీసుకెళ్లారు. భవనం తొలగించగా.. మిగతా స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు దేవస్థానం నుంచి అభ్యంతరాలు రాకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సురేష్, చినదగిలి తహసీల్దార్ రమణయ్య, 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, పార్టీ వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ విజేత సదరన్ రైల్వే



విజేత సదరన్ రైల్వే జట్టు

విశాఖ స్పోర్ట్స్: ఆల్ ఇండియా రైల్వే బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌ను సదరన్ రైల్వే జట్టు కైవసం చేసుకుంది. ఏడు జోన్ల జట్లు ఈ టోర్నీలో రౌండ్ రాబిన్ పద్ధతిలో తలపడ్డాయి. రైల్వే స్టేడియంలోని బాల్ బ్యాడ్మింటన్ కోర్టులో గురువారం జరిగిన పోరులో ఈస్ట్‌కోస్ట్ రైల్వే జట్టు 2–0తో ఐసీఎఫ్‌పై, సౌత్ సెంట్రల్ రైల్వే 2–0తో వెస్ట్రన్ రైల్వే జట్టుపై విజయం సాధించాయి. మరో మ్యాచ్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే జట్టు 2–0తో సౌత్ ఈస్ట్రన్ రైల్వే జట్టుపై విజయం సాధించింది. సదరన్ రైల్వే 2–0తో ఈస్ట్‌కోస్ట్ రైల్వే జట్టుపై విజయం సాధించింది. దీంతో ఓవరాల్‌గా సదరన్ రైల్వే జట్టు పాయింట్ల పట్టికలో ఆధిక్యాన్ని ప్రదర్శించి విజేతగా నిలిచింది. ఐసీఎఫ్ రన్నరప్‌గా, సౌత్ సెంట్రల్ రైల్వే సెకండ్ రన్నరప్‌గా నిలిచాయి. పోటీల ముగింపు కార్యక్రమానికి డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ హాజరై విజేతలకు ట్రోఫీలు అందించారు. ఈకోర్సా వాల్తేర్ క్రీడాధికారి ప్రవీణ్‌బాటి, సలహాదారు ఎ.కె.మహారాణా, సంయుక్త క్రీడాధికారి బి.అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

వాంబే కాలనీలో అగ్ని ప్రమాదం

- గ్యాస్ సిలిండర్ లీకై వ్యాపించిన మంటలు
- నలుగురికి గాయాలు



క్షతగాత్రులను కేజీహెచ్‌కు తరలిస్తున్న 108 సిబ్బంది

పీఎం పాలెం : వంట గ్యాస్ సిలిండర్ లీకేజీ నుంచి మంటలు ఎగసి పడి నలుగురు గాయపడ్డారు. గురువారం ఉదయం ఆరు గంటలకు చోటు చేసుకున్న ఈ దుర్ఘటనలో నలుగురికి కాలిన గాయాలు కాగా.. అందులో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పీఎంపాలెం సీఐ వై. రామకృష్ణ, స్థానికులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 7వ వార్డు వాంబే కాలనీలోని బ్లాక్ నంబరు 27 బీఎఫ్‌ఎఫ్–2లో యలమల బాలరాజు, అతని భార్య చిన్ను, కుమారులు గిరి, కార్తీక్ నివసిస్తున్నారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు వంట చేయడానికి చిన్ను వంట గదిలోకి వెళ్లేసరికి గ్యాస్ వాసన రావడంతో సిలిండర్ నుంచి గ్యాస్ లీక్ అవుతున్నట్లు గుర్తించారు. గ్యాస్ లీకేజీ నివారించడానికి ప్రయత్నిస్తూ లైటు వెలిగించడానికి స్విచ్ ఆన్ చేయగా సిలిండర్ రెగ్యులేటర్ వద్ద మంటలు వ్యాపించాయి. ఇది గమనించిన ఆమె భయంతో కేకలు వేశారు. దీంతో ఆమె భర్త బాలరాజు, కుమారులు గిరి, కార్తీక్ వచ్చారు. మంటలను అదుపు చేయడాని చేసిన ప్రయత్నంలో వారికి గాయాలయ్యాయి. ఇంట్లోని టీవీ, ఫ్యాను వంటి సామగ్రి కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డీఆర్‌ఎఫ్ దళాలకు సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. బాలరాజు చిన్న కుమారుడు కార్తీక్‌కు ఎక్కువగా కాలిన గాయాలయ్యాయి. గాయపడిన వారందరినీ 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు.

నేటి నుంచి పిల్లల పండగ

- చిల్డ్రన్స్ ఎరీనా వేదికగా వైజాగ్ జూనియర్ థియేటర్ ఫెస్ట్
- మూడు నాటికల ప్రదర్శన
- సోమవారం జీవీఎంసీ పాఠశాలల విద్యార్థులకు ఉచిత ప్రవేశం

బీచ్‌రోడ్డు: కోవిడ్ కాలంలో నేరుగా కలుసుకునే అవకాశం లేకపోవడంతో.. భావ వ్యక్తీకరణ పూర్తిస్థాయిలో తగ్గిపోయింది. ముఖ్యంగా పిల్లలు ఇంటికి, మొబైళ్లకు పరిమితం కావడంతో వారిలో మంచి, చెడు, ఆనందం, సామాజిక స్పృహ కరువయ్యాయి. ఈ నేపథ్యంలో పిల్లల్లో సృజనాత్మక శక్తి, ఆత్మవిశ్వాసం, భావ వ్యక్తీకరణ, సామాజిక స్పృహ పెంపొందించేందుకు రంగస్థలాన్ని వేదికగా చేసుకున్నారు సంధ్య, ప్రియా, సోనాల్. లిట్ లాంటర్న్ ఫర్ కల్చర్ అండ్ లిటరేచర్ వెల్ఫేర్ సొసైటీని స్థాపించి ఈ ఏడాది జనవరిలో వైజాగ్ జూనియర్ థియేటర్ ఫెస్ట్ మొదటి ఎడిషన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర వాసుల నుంచి విశేష స్పందన లభించడంతో రెండో ఎడిషన్‌ను మరింత అద్భుతంగా తీర్చిదిద్దారు. ఇందులో భాగంగా మూడు రోజుల పాటు మూడు నాటికలు ప్రదర్శించనున్నారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనా వేదికగా శని, ఆదివారాల్లో ఉదయం, సాయంత్రం తారస్ ట్రియో, మాల్గుడి డేస్ నాటికలు, సోమవారం బరిబతల రాజా నాటిక ప్రదర్శనకు ఏర్పాటు చేశారు. మొదటి ఎడిషన్‌లో పూర్తిగా ఇంగ్లిష్ డ్రామాలను మాత్రమే ప్రదర్శించారు. అయితే తెలుగు మీడియం విద్యార్థులకు కూడా ఆనందం, విజ్ఞానం అందించేందుకు ఈ ఎడిషన్‌లో తెలుగు నాటికను జత చేశారు. హైదరాబాద్‌కు చెందిన భూమిక థియేటర్ గ్రూప్ బరిబతల రాజా కథను చెప్పనుంది. జీవీఎంసీ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా ఈ నాటికను ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నవ్విస్తూ.. ఆలోచింపజేస్తూ..

- సామాజిక స్పృహ, మంచి, చెడులను తెలిపే విధంగా ప్రముఖ రచయిత ఆర్. కె. నారాయణ్ రాసిన మాల్గుడి డేస్ కథలను పుణేకు చెందిన స్వతంత్ర థియేటర్ గ్రూప్ డ్రామా రూపంలో చెప్పనుంది. మాల్గుడి అనే గ్రామంలో జరిగే నాలుగు కథలను గ్రూప్ సభ్యులు ప్రదర్శించనున్నారు. చిన్నతనం నుంచి వృద్ధాప్యం వరకు వివిధ స్టేజ్‌లో జరిగే పరిణామలను వినోదాత్మకంగా చెప్పనున్నారు.
- సాంకేతికత, ఊహ, విసుగు అనే మూడు అంశాలతో తారా అనే చిన్నారి జీవితం ముడిపడి ఉంటుంది. అయితే ఓ సారి తన కుటుంబం కఠినమైన పరిస్థితుల్లో ఇరుక్కుంటుంది. అప్పుడు ఈ మూడు అంశాల ద్వారా ఆ పరిస్థితుల నుంచి తన కుటుంబాన్ని ఎలా రక్షించుకుందో తారస్ ట్రియో నాటిక ద్వారా ముంబయికి చెందిన కలెక్టివ్ మ్యాడ్‌నెస్, కన్జర్వేటరీ ఫర్ ఆర్ట్స్ అండ్ ఆర్టిస్ట్స్ చెప్పనున్నారు.
- ఓ రాజు తన రాజ్యం కోసం కాకుండా తన కోసం మాత్రమే నిరంతరం ఆలోచిస్తూ.. ప్రజలను నిర్లక్ష్యం చేస్తుంటాడు. ఆ రాజుకు దుస్తులపై ఉన్న పిచ్చిని గుర్తించి కొంత మంది ఆయన్ని మోసం చేస్తారు. ప్రజలను పట్టించుకోకుండా తన స్వార్థం కోసం ఆలోచించడం వల్ల మోసపోయాయని, అందరి కోసం ఆలోచించాలని పిల్లలకు అర్థమయ్యేలా హైదరాబాద్‌కు చెందిన కళాకారులు బరిబతల రాజా నాటికను ప్రదర్శించనున్నారు.

నవ్వించే మైమ్ ప్రదర్శన

కేవలం హావభావాలతో నవ్వించడంతో పాటు ఓ మంచి సందేశాన్ని చిన్నారులు మైమ్ ప్రదర్శన ద్వారా ఇవ్వనున్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూలనే లక్ష్యం



శ్రీవాత్సవ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న చినబాబు

కొమ్మాది: సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ హెల్త్ అడ్వైజర్ వినీత శ్రీవాత్సవ్ సూచించారు. 'ఆంధ్రరాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో సికిల్‌సెల్ అనీమియా' అంశంపై రుషికొండలోని గిరిజన సాంస్కృతిక శిక్షణ మిషన్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆమె ప్రసంగించారు. ఈ వ్యాధిపై గిరిజన ప్రజలకు అవగాహన కల్పించడం, వైద్య పరీక్షలు నిర్వహించడం, వ్యాధి నిర్ధారణ అయిన వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇవ్వడం, నాణ్యమైన మందులు, పౌష్టికాహారం అందేలా చూడటం తదితర అంశాలపై ఆరోగ్యసిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చినబాబు తదితరులు పాల్గొన్నారు.